# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## గడ్డివాములు దగ్ధం



పెద్దపంజాణి మార్చి 26 ప్రభాతవార్త : మండలంలోని బసవరాజుకండ్రిగ సమీపంలో ఒంటిల్లు వద్ద అగ్నిప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా..ఒంటిల్లు సమీపంలో నివాసంఉంటున్న సుబ్రమణ్యం, మణి, మోహనలకు చెందిన మూడు గడ్డివాములు అగ్నిప్ర మాదంలో దగ్ధం కావడం జరిగింది.బాధితులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలం చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసారు.అయితే వాహనం సంఘటనాస్థలంలోనే మొరాయించడంతో అగ్నిమాపక సిబ్బంది తర్జనబర్జన పడటంజరిగింది.సమీప రైతులు మిగిలిన మంటలను ఆర్పేప్రయత్నం చేసినప్పటికీ మూడు గడ్డివాములు పూర్తిగా దగ్ధంకావడం జరిగింది.దీంతో రైతులకు సుమారు రెండులక్షల మేరా ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

## హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం

చిత్తూరు, మార్చి 26 ప్రభాతవార్త:



హైకోర్టు న్యాయమూర్తి, చిత్తూరు జిల్లా పరిపాలనా న్యాయమూర్తి మాణవేంద్ర నాథ్ రాయ్ ను ఆదివారం చిత్తూరు ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావ్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డిలు వేరు వేరుగా పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. చిత్తూరు జడ్పీ సమావేశభవనంలో న్యాయమూర్తులకు జరిగిన ఒక రోజు సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మాణవేంద్రనాథ్‌రాయ్ హాజరయ్యారు.

## చంద్రప్రభపై శ్రీరామచంద్రుడు





తిరుపతి,మార్చి 26ప్రభాతవార్త:
త్రేతాయుగంలో శ్రీరామచంద్రమూర్తి అవతారంలో కలియుగంలో కోదండరాముడుగా భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఏడవరోజు ఆదివారం రాత్రి చంద్రప్రభవాహనంపై భక్తులను కటాక్షించాడు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న కోదండరాముడు వాహనమండపం వద్దకు వేంచేశారు. ఇక్కడ ఆలయ అర్చకులు, అధికారులు కర్పూర హారతులిచ్చి చంద్రప్రభ అధిరోహించిన శ్రీరామచంద్రుడు ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులకు అభయమిచ్చాడు. స్వామివారికి సూర్యచంద్రులు రెండునేత్రాలు. ఉదయం సూర్యప్రభలో ఊరేగిన కోదండరాముడు రాత్రి నిశాకరుడైన చంద్రప్రభతో కూడన వాహనంపై విహరించాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఎఇఒ మోహన్, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి భక్తులు పాల్గొన్నారు.

**-సూర్యప్రభపై సీతామూర్తి:**

కోదండరాముని బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం స్వామివారు సూర్యప్రభనుఅధిరోహించి మాఢవీధుల్లో విహరించాడు.సూర్యుడు స్వయంప్రకాశితమైన సూర్యదేవుడ్ని వాహనంగా చేసుకు న్న శ్రీరాముడు సప్తఅశ్వాలు లాగుతున్నట్లుగా రూపొందించిన సూర్యప్రభవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. సూర్యుడు సకలరోగ నివారకుడు. ఆరోగ్యకారకుడు. సూర్యప్రభవాహనంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఇతోధిక బోగభాగ్యాలు ,సత్సంతానసంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి.

# ఒక్క విజయంతో మరెన్నో ప్రయోగాలు

**ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్ ప్రయోగం సక్సెస్**

**హుషారుగా మరిన్ని ప్రయోగాలకు సిద్ధం**



షార్ నుంచి నింగికి దూసుకుపోతున్న ఎల్‌విఎం3 రాకెట్,




శ్రీహరికోట వీక్షకుల గ్యాలరీలో క్రిక్కిరిసిన సందర్శకులు



షార్ మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడుతున్న ఇస్రో ఛైర్మన్, ఎన్ఎస్ఐఎల్ ఛైర్మన్, మిషన్ డైరెక్టర్లు

శ్రీహరికోట (తడ), మార్చి 26 ప్రభాతవార్త
తిరుపతి జిల్లా శ్రీహరికోట ఆదివారం మరోసారి విజయ గర్వంతో మెరిసిపోయింది. భారత శాస్త్రవేత్తలు ఎల్‌విఎం3-ఎం3 రాకెట్ ప్రయోగంతో మరో సక్సెస్ సాధించారు. ఈ ఏడాది ఎస్ఎస్ఎల్‌వి డి2 రాకెట్ ప్రయోగ విజయం తర్వాత షార్‌కు మరో విజయం దక్కింది. ఆదివారం ఉదయం 9 గంటల 20 సెకన్లకు షార్‌లోని సెకండ్ లాంచ్ ప్యాడ్ నుంచి భారత బాహుబలిగా పిలిచే జీఎస్ఎల్‌వి మార్క్3 సిరీస్‌లో 6వ రాకెట్ ఎల్‌విఎం3-ఎం3 అంతరిక్ష కక్ష్యకు దూసుకెళ్లింది. ఈ ప్రయోగాన్ని మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు యుకెకి చెందిన వన్‌వెబ్ అధికారులు, ఎన్ఎస్ఐఎల్ అధికారులు, ఇన్‌స్పేస్ ప్రముఖులు పెద్ద సంఖ్యలో వీక్షించారు. అక్కడికి కొంచెం దూరంలోని వీక్షకుల గ్యాలరీలో పదివేలమందికి పైగా సందర్శకులు సందడి చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఉదయం పూట రాకెట్‌ను వీక్షించవచ్చన్న ఉత్సాహంతో తెల్లవారుజాము నుంచే షార్ వీక్షకుల గ్యాలరీకి సందర్శకులు పోటెత్తారు. ప్రత్యేకించి తమిళనాడు నుంచి ప్రత్యేక వాహనాలలో తరలిరావడంతో పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా సూళ్లూరుపేట, అటకానితిప్పల మధ్య వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి.




రాకెట్ ఎగురు తున్నప్పుడు ఆకాశంలో కనిపించిన విహంగం

మొదటిగేటు సమీపం నుంచి వీక్షకుల గ్యాలరీకి వెళ్లే మార్గం మొత్తం వాహనాలతో క్రిక్కిరిసిపోయింది. కొన్ని వాహనాలు గ్యాలరీకి చేరుకోకముందే సమయం సమీపించడంతో ఎక్కడి వారక్కడే ఉండే ఈ ప్రయోగాన్ని చప్పట్లతో వీక్షించారు. అటు వీక్షకుల గ్యాలరీలోనూ సందర్శకులకు కనువిందు చేసేందుకు పలురాకెట్ల నమూనాలు, ఇస్రో అభివృద్ధిపై కొన్ని మొబైల్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే షార్‌లో ఈ ప్రయోగ విజయం తర్వాత భవిష్యత్ ప్రయోగాలపై అప్పుడే ఏర్పాట్లు మొదలయ్యాయి. ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ స్వయంగా త్వరలో జరగనున్న ప్రయోగాల గురించి వివరించారు. ఏప్రిల్ నెలలోనే పిఎస్ఎల్‌వి సి-55 ప్రయోగం ఉంటుందన్నారు. ఆ తర్వాత జిఎస్ఎల్‌వి మార్క్2 ప్రయోగంతో పాటు చంద్రయాన్3, ఆదిత్య ఎల్1 ప్రయోగాలు జరుపుతామన్నారు. గగన్‌యాన్‌కు సంబంధించి మరిన్ని పరిశోధనలు, ప్రయోగాలు షార్ నుంచే జరుపుతామని సోమనాథ్ పేర్కొన్నారు. ఆయనతో పాటు ఇన్‌స్పేస్ ఛైర్మన్ పవన్‌కుమార్ గోయింక, ఎన్ఎస్ఐఎల్ ఛైర్మన్ డి.రాధాకృష్ణన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, మిషన్ డైరెక్టర్ మోహన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## పికెఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

# నామమాత్రమేనా..?


**ఉమ్మడి జిల్లా నుంచి విడిపోయిన మదనపల్లి..**
**అథారిటీ కొనసాగింపుపై అయోమయం !!**

*కుప్పం, మార్చి 26 ప్రభాతవార్త*
*గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పలమనేరు, కుప్పం, మదనపల్లి ప్రాంతాల అభివృద్ధి కోసం అప్పటిసిఎం చంద్రబాబునాయుడు పికెఎం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పికెఎం ఉడా)ను ప్రారంభించారు. 2018లో పికెఎం ఉడాకు తొలి ఛైర్మన్‌గా మాజీ జడ్పీఛైర్మన్ ఎం.సుబ్రమణ్యంరెడ్డిని నియమించారు. ఆయన కేవలం ఆర్నెల్లపాటే ఆ పదవిలో కొనసాగారు. పికెఎం ఉడా కార్యాలయం కోసం కుప్పంలో నూతనంగా నిర్మించిన కడ కార్యాలయం భవనాలను అప్పట్లో కేటాయించారు. పికెఎం ఉడా కార్యాలయంను కుప్పంలో నూతనంగా నిర్మించిన కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం 2019లో వైకాపా అధికారంలో వచ్చాక ఆ పదవికి సుబ్రమణ్యంరెడ్డి రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా వైకాపా ప్రభుత్వం సైతం తెదేపా హయాంలో ఏర్పాటుచేసిన పికెఎం ఉడాను కొనసాగిస్తూ వచ్చింది. ఇదివరకు చిత్తూరు జిల్లా ఉమ్మడిగా ఉన్న నేపథ్యంలో పికెఎం ఉడాకు ఛైర్మన్‌గా పుంగనూరుకు చెందిన వైకాపా సీనియర్ నేత, మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు వెంకటరెడ్డి యాదవ్‌ను నియమించారు. అయితే గతేడాది జిల్లాల పునర్విభజన జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పికెఎం ఉడా పరిధిలో ఉన్న మదనపల్లి అన్నమయ్య జిల్లా పరిధిలోకి చేరిపోయింది. దీంతో పలమనేరు, కుప్పం, మదనపల్లి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నామమాత్రంగానే కొనసాగుతోందా లేక పికెఎం ఉడా పరిధిలో మదనపల్లిని తొలగించి చిత్తూరు జిల్లాలోని మరో నియోజకవర్గాన్ని చేర్చుతారా అనే సందేహం నెలకొంది. ఉన్నతాధికారులు, ప్రభుత్వం ముందు ఈ అథారిటీ ఏర్పాటుపై నెలకొన్న అయోమయానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.*

# సంక్షేమ ఫలాలు అందుకోండి ...

**డిప్యూటీ సీఎం నారాయణస్వామి**

**- మండల మహిళ సంఘాలకు రూ. 10 కోట్ల చెక్కు పంపిణీ**



వెదురుకుప్పం, మార్చి 26 ప్రభాతవార్త :
సంక్షేమ ఫలాలు అందుకోని ... జగనన్నకు ఓటు వేసి గెలిపించాలని... రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఆదరించాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి మహిళలను కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం వెనుక భాగంలో మూడవ విడత వైఎస్ఆర్ ఆసరా పంపిణీ కార్యక్రమ సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్ర పటంకఉ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా
ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామిని క్యాలండర్‌గా చేసుకుని పారదర్శకంగా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల బ్యాంకు ఖాతలోకి జమచేస్తున్న ఘనత కేవలం మన ముఖ్యమంత్రి జగనన్నకే సాధ్యమయిందన్నారు. రాష్ట్రం ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నా హామి ఇచ్చిన ప్రతి మాట నేరవేర్చడం జరుగుతుందని గుర్తు చేశారు. రైతులకు రుణాలు, మహిళ సాధికారత సాధించడంకు వైఎస్ఆర్ ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా మహిళ సంఘాల బలోపేతంకు నగదు చెల్లింపు చేయడం జరుగుతుందన్నారు. వెదురుకుప్పం మండలంకు 961 సంఘాలకు 9284 మంది లబ్ధిదారులకు తొమ్మిది కోట్లా 70 లక్షల రూపాయలు మూడవ విడత పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆ మేరకు నగదు చెక్కును మహిళలకు అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాం తెలుగు దేశంకు తిరుగులేదని చంద్రబాబు నాయుడు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన నమ్మి మోసపోవద్దని చెప్పారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శిల్పా, ఎంపీపీ బండి నాగరాణి, జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్. మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, ఎంపిడివో సుధాకర్‌రావు, డిఆర్‌డిఏ పీడీ నాగతులసి, ఎపియం కవిత, ఎంపిటిసి తోకల మురళి రెడ్డి, నాయకులు గోవర్ధన్ రెడ్డి, హేమసుందర్ రెడ్డి, హేమశేఖర్ రెడ్డి, నారాయణ రెడ్డి, రామయ్య, బట్టే సుబ్రమణ్యం, ధనంజేయులు రెడ్డి,బొజ్జా రెడ్డి,దామోదర్ రెడ్డి, అధికారులు, డ్వాక్రా సంఘం మహిళలు, సంఘమిత్రాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి

# సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## మంత్రి రోజా



విజయపురం, మార్చి 26 ప్రభాతవార్త :
ప్రతి కుటుంబానికి సంక్షేమం చేకూర్చడానికి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన విజయపుం ఎంపిడిఒ ఆఫీస్ ఆవరణలో పొదుపు సంఘాల గ్రూప్‌లకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో ఆసరాలో భాగంగా 676 సంఘాలకు రూ. 141 కోట్లు పంపిణీ చేశామని, మూడు విడతల్లో మండలంలో మొత్తం రూ. 421 కోట్లు పంపిణీ చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలు అందించి ప్రతి కుటంబానికి పెద్ద కొడుకుగా నిలిచారని తెలిపారు. అనంతరం సిఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి జమున, ఎంపిడిఒ సతీష్, తహశీల్దారు వెంకట్రాయలు, ఇఒ పిఆర్‌డి బాబు, ఎపిఎం రమాదేవి, ట్రాన్స్‌కో ఎఇ చంద్రబాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, వైస్ ఎంపిపి దశరథ, సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి, సిసిలు రజని, సుబ్రమణ్యం, సుదాకర్, ఇంకా నాయకులు జప మేరీ ప్రసన్నకుమార్ వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

**భాస్కర్‌రాజు కుటుంబానికి పరామర్శ**

మండలంలోని జంబాడ సర్పంచ్ భాస్కర్‌రాజు కుటుంబాన్ని మంత్రి రోజా ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఆయన మాతృమూర్తి వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటంబానికి ఆమె సానుభూతి తెలిపారు. అలాగే కోసలనగరంలోని మురళీకృష్ణ కుమార్తె, కుమారుడి కేశ ఖండన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షుడు గోపినాథ్, ఇంకా నాయకులు సతీష్‌యాదవ్, నారపరాజు, సుబ్బుయాదవ్, శివరాజు, భాస్కర్‌రెడ్డి, కుప్పారెడ్డి, శేఖర్‌రాజు, హరికృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ అర్చకుడి సస్పెన్షన్

**ఈఓ పట్ల దురుసుగా ప్రవర్తించాడని...**

కాణిపాకం, మార్చి 26 ప్రభాతవార్త:
ఈఓ పట్ల దురుసుగా ప్రవర్తించాడనే ఆరోపణతో ఆలయ అర్చకుడిని సస్పెన్షన్ చేసిన సంఘటన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శనివారం చోటుచేసుకుంది. సంఘటనకు సంభందించి వివరాలిలావున్నాయి. కాణిపాకం దేవస్థానం ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న పి.కృష్ణమోహన్ తనకు సెలవు కావాలని కోరుతూ సెలవు చీటి తీసుకుని ఈఓ క్యాంపు కార్యాలయంకు శనివారం ఉదయం 9.30 గంటలకు వెళ్ళగా సెలవు కాలములో విధులు నిర్వహించే అర్చకుడు, ఆలయ ఏఈఓ వద్ద సంతకము తీసుకుని రావాలని ఈఓ చెప్పినట్లు తెలిసింది. ఈసందర్భంగా అర్చకుడు కృష్ణమోహన్ ఈఓ పట్ల దురుసుగా ప్రవర్తించాడని,అతనిపై చర్యలు తీసుకునేందుకు శనివారం జరిగిన పాలకమండలిలో చర్చకు వుంచారు. ఈసందర్భంగా పాలకమండలిలో తీసుకున్న నిర్ణయం మేరకు శనివారం అర్చకుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణమోహన్ స్థానంలో శ్రీవరదరాజస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న వి.హరీష్‌ను నియమిస్తున్నట్లు ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. అర్చకుడి సస్పెన్షన్ శనివారం నుండి అమలులోకి వస్తుందని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా వుండగా వివిధ కారణలతో గత గత ఆరు నెలల కాలంలో ముగ్గురు అర్చకులను ఆలయ అధికారులు సస్పెండ్ చేయగా కృష్ణమోహన్ సస్పెన్షన్‌తో ఈసంఖ్య నాలుగుకు చేరుకుంది. దీనితో దేవస్థానంలో పనిచేసే అర్చకుల్లో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని అభద్రతాభావం నెలకొంది.

## పంటపొలాలపై ఏనుగుల దాడులు

సదుం,మార్చి26ప్రబాతవార్త
మండల పరిదిలో ఈమధ్య కాలంలో ఎటువంటి శబ్దం లేకుండా ఉన్న ఏనుగులు ఒక్కసారిగా వచ్చిపడ్డాయి.శనివారం రాత్రి పలువురి పొలాలపై దాడులు చేసి పంటలను తొక్కి వేసి నష్టం కలిగించాయి. మండల పరిదిలోని చెరకువారిపల్లె, జోగివారిపల్లె పరిసరాలలో ఈ ఏనుగులు తరచు తిరుగుతూ పంటలను నష్టపరిచేవి. దాదాపు నెల రోజులుగా అలికిడి లేదు. ఇవి ఎక్కడికో వెళ్లి పోయి ఉంటాయని అందరు అనుకున్నారు. ఆదివారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు తమ పొలాలను ఏనుగులు తొక్కి నష్టపరిచిన విషయాన్ని గమనించారు. చెరకువారిపల్లె పంచాయతీకి చెందిన జీవీరమణ, ఏ.లక్ష్మీదేవి, యాగవేంద్రరెడ్డిలకు చెందిన వరి, చెరకు పంటలను తొక్కి పడేశాయి. దీనితో రైతులు ఆందోళనచెందుతున్నారు. గతంలో ఏనుగు మృతి చెందిన ప్రదేశంలో రాత్రి ఏనుగుల గుంపు తిరిగింది. అక్కడంతా ఏనుగుల పాదముద్రలతో పంట పొలాలు నిండిపోయాయి. వీఆర్వో పురుషోత్తం తదితరులు వచ్చి పరిశీలించారు. అదికారులకు సమాచారం పంపించారు.



వరిపొలాన్ని చూపుతున్న రైతు

# నగర పాలక వాహనాలకు 'ఆ' పరిమితులెందుకో..?

తిరుపతి కార్పొరేషన్, మార్చి 27, ప్రభాతవార్త
వాహనాలకు ఇన్స్యూరెన్స్ లేదా..? సామర్థ్యం లేదా..? రోడ్ టాక్స్ లేదా..? రాసేయ్ చలానా.. ఆపెయ్ వాహనాన్ని ఇది నేడు రోడ్డు రవాణా సంస్థ అధికారుల రుబాబు.. ఇలాంటి నియమ నిబంధనలు మాకు పట్టవండోయ్.. అంటూ నగరంలోని రోడ్లపైన జూయ్‌మంటూ వెళ్తున్నా పట్టించుకునే మహానుబావుడు కరువైయ్యారు. ఎవరైనా నోరు తెరిచినా, మా వాహనాలు చెక్ చేసినా మీకు త్రాగు నీటి కుళాయి, డ్రైనేజీ కట్ చేస్తామంటూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎవ్వరికీ చెప్పుకోలేక మింగలేక.. కక్కలేక మిన్నకుంటున్నారు. ఇదీ నేటి నగర పాలక అధికారుల పనితీరు.. వివరాలు ఇలా ఉన్నాయి. నగర పాలక సంస్థలో సుమారు 110 చెత్త సేకరణ ఆటోలు, ఐదు ట్రాక్టర్లు, 3 జేసిబిలు ఉన్నాయి. ఇలా ఎన్నో




వాహనాలు. ఇందులో 90 శాతం వాహనాలకు ఇన్సూరెన్స్, రోడ్డు టాక్సు, ఫిట్నెస్ వుంటే ఒట్టు.. అయినా వాహనాలను యధేచ్ఛగా వాహనాలు నగరంలో నడుస్తున్నాయి. ఈ వాహనాల నిర్వహణకు ఓడిఈ స్థాయి అధికారిని నియమించినా ఆయన ఆడిందే ఆట.. పాడిందే పాట.. ఆయన దగ్గర ఎవరైనా నోరు తెరిస్తే.. అమ్మనా భూతులే.. వాడి నోటికెందుకు ఎందుకొచ్చిందిరా దేవుడా అని ఉన్నతాధికారులు నోరు మూసుకుని ఉంటున్నారంటే ఆ అధికారి ఎంత గొప్పవాడో అర్థం అవుతుంది. కమిషనర్ సైతం ఆ విషయంలో వెనక్కు తగ్గుతున్నారంటే మీకే అర్థం అవుతుంది దీని బట్టి నగర పాలక సంస్థలో ఎటువంటి పరిస్థితి నెలకొందో అర్థం అవుతుంది. ఇప్పటికైనా రోడ్డు రవాణా శాఖాధికారులు, నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి వాహనాల పై ఒక్కసారి దృష్టి సారించి గాడిలో పెడతారని ప్రతి ఉద్యోగి ఆశిస్తున్నారు.

## రంజాన్ వేళలు

ఉపవాసదీక్ష-5 -తేదీ: 27.03.2023 సోమవారం

శ్రీకాళహస్తి:-ఇఫ్తార్ సాయంత్రం 6:25 మంగళవారం సహారి:-ఉదయం 4:58

